జగనన్నను మళ్లీ ఆశీర్వదించండి

- చంద్రబాబు వస్తే ఒక్క పథకమూ రాదు
- మాట మీద నిలబడే నైజం జగనన్నది
- పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి



గుర్రంకొండలో ఆసరా చెక్కును పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

గుర్రంకొండ; రాబోయే 2024 సాధారణ ఎన్నికల్లో జగనన్నను మహిళలందరూ మరొకసారి ఆశీర్వదించి మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక తెలుగు జెడ్పీహైస్కూల్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో డ్వాక్రా మహిళలకు ఆసరా చెక్కులను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ ఎన్ని కష్టాలు ఉన్నా అక్కచెల్లెమ్మలకు ఇచ్చిన మాటను జగనన్న నిలబెట్టుకొన్నారన్నారు. 825 సంఘాలకు రూ.7.85 కోట్లను ఆసరా రూపంలో ఇచ్చారన్నారు. జగనన్న అధికారంలోకి వస్తేనే రాష్ట్రంలో సంక్షేమ పథకాలు కొనసాగుతాయన్నారు. పొరబాటున చంద్రబాబుకు అధికారమిస్తే వలంటీర్ వ్యవస్థ, సచివాలయ వ్యవస్థలను రద్దు చేస్తారన్నారు. అంతేకాక టీడీపీ ప్రభుత్వంలో ఇప్పుడు అమలు చేస్తున్న ఏ ఒక్క ప్రభుత్వ పథకం ఇవ్వరన్నారు. మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలనే ఉద్దేశంతోనే ముఖ్యమంత్రి అన్ని పథకాలను మహిళలకే ఇస్తున్నారన్నారు. ఇంక 10 నెలల్లో ఎన్నికలు రానున్నాయని చంద్రబాబు, లోకేష్ మాటాలు విని మహిళలు మోసపోవద్దన్నారు. జగనన్నను నమ్మితేనే మీ కుటుంబాలు బాగుపడతాయన్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ రవినాయక్, జెడ్పీటీసీ సమ్రీన్ ముక్తియార్, మండల ఆర్బీకే చైర్మన్ జయచంద్రారెడ్డి, మండల సచివాలయాల కన్వీనర్ నాగేంద్ర, రెడ్డెమ్మకొండ చైర్మన్ నరసింహారెడ్డి, వైస్ ఎంపీపీ కరుణాకర్, మండల ప్రత్యేక ఆహ్వానితులు అప్పల్ల, చంద్రశేఖర్, సింగిల్‌విండో డైరెక్టర్లు ప్రకాష్‌రెడ్డి, వెంకటరెడ్డి, మాజీ ఎంపీపీ జమీర్‌అలీఖాన్, సర్పంచ్‌లు మస్తాన్‌రెడ్డి, విశ్వనాథ్, ఎంపీటీసీలు రాజగోపాల్, సరస్వతమ్మ, ఖదీర్, గంగులమ్మలు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా పాలన

వాల్మీకిపురం: నాలుగేళ్లలో చేసిన అభివృద్ధి, సంక్షేమ పాలనతో ప్రజలు ముందుకు వెళుతున్న నాయకుడు సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి అని పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని చింతపర్తి గ్రామంలోని మదనపల్లి రోడ్డు, బజారువీధిలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికి వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రోడ్లు, కాలువలు, విద్యుత్ స్తంభాలు, విద్యుత్ దీపాలు, పింఛన్లు, ఇండ్లు తదితర సమస్యలను ఎమ్మెల్యే చింతల దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింతల మాట్లాడుతూ రాష్ట్రంలో వైఎస్ జగనన్న అధికారంలోకి వచ్చాక పేదలకు అనుగుణంగా సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టి వాటిని అర్హులైన ప్రతి ఇంటికీ చేర్చేలా ప్రత్యేక చర్యలు చేపట్టారన్నారు. గత పాలకులు ప్రజలకు మాయమాటలు చెప్పి మోసం చేశారని, కానీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన మాట నిలబెట్టుకుంటూ ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తూ పారదర్శక పాలన అందిస్తున్నారన్నారు. అవినీతికి తావులేకుండా అర్హుల ఖాతాల్లోకి నేరుగా సంక్షేమ లబ్ధి జమ చేస్తూ ప్రజల మన్ననలు పొందుతున్నారన్నారు. పేదల సంక్షేమానికి కృషి చేస్తున్న సీఎం జగన్మోహన్ రెడ్డికి రాబోయే ఎన్నికల్లో అండగా నిలవాలని కోరారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో మూడు, నాలుగు రోజులు పాటు ప్రభుత్వ కార్యాలయాల వద్ద పింఛన్ కోసం కాసుకోవాల్సి వచ్చేదని, ఇప్పుడు ఒకటో తేదీన పింఛన్ ఇంటికి తెచ్చి ఇస్తున్నారని వృద్ధులు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. పార్టీలకు అతీతంగా అర్హులైన అందరికీ ప్రభుత్వ పథకాలు అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగనే మళ్లీ అధికారంలోకి రావాలని ప్రజలు ఆకాంక్షిస్తున్నారన్నారు. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిలా వలంటీర్లు పని చేయాలన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ పూర్తిస్థాయిలో మద్దతు తెలిపి మళ్లీ వైఎస్ జగన్మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిని చేయాలని ఆయన ప్రజలను కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ షబ్బీర్ అహ్మద్, ఈవో పాండు, నాయకులు ఓరుగంటి రమేష్, లక్ష్మీనారాయణ రెడ్డి, రామక్రిష్టారెడ్డి, నీళ్లభాస్కర్, వెంకట్రమణ, కిరణ్ కుమార్, మోహన్ రెడ్డి, ఫారుఖ్, చెంగల్‌రెడ్డి, మెంబర్ శీనా, శ్రీనివాసులు, నల్లంకి నరసిహులు, సుధాకర, విజయ్, రెడ్డినరసింహులు పాల్గొన్నారు.

నేడు గడప గడపకూ మన ప్రభుత్వం

మండలంలోని గంగాదొడ్డి, కూరపర్తి గ్రామాల్లో బుధవారం ఉదయం 6గంటల నుంచి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీపో షబ్బీర్ అహ్మద్, సర్పంచ్ చిట్టెమ్మ తెలిపారు. ఇందులో భాగంగా పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి ఇంటింటికి వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకొని, పరిష్కార సమస్యలను అక్కడిక్కడే పరిష్కరిస్తారని తెలిపారు. మండల స్థాయి అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు హాజరుకావాలని వారు కోరారు.

క్లుప్తంగా

నేటి నుంచి వాసవీ జయంతి ఉత్సవాలు

మదనపల్లె సిటీ : స్థానిక వాసవీభవన్ వీధిలోని శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో బుధవారం నుంచి వచ్చే నెల 2 వరకు వాసవీ జయంతి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆర్య వైశ్య సంఘం అధ్యక్షులు ఓం ప్రకాష్ ఒక ప్రకటనలో తెలిపారు. 26న సుప్రభాతం, గణపతిహోమంతో ఉత్సవాలు ప్రారంభిస్తామన్నారు. ప్రతి రోజు సాయంత్రం కంకుమార్చన, లలితా సహస్రనామపారాయణం జరుగుతాయన్నారు. 30న అమ్మవారి జయంతి పురస్కరించుకుని అమ్మవారికి పుష్పపల్లకి అత్యంత వైభవంగా జరుగుతుందన్నారు. అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

క్రిస్టియన్ మైనారిటీ సెల్ అధ్యక్షుడిగా జాన్‌బాబు

మదనపల్లె : వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా బోనాసి జాన్‌బాబు నియమితులయ్యారు. మంగళవారం పట్టణంలోని క్రైస్తవ సోదరులతో కలిసి జాన్‌బాబు స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఎమ్మెల్యేను మర్యాద పూర్వకంగా కలిశారు. మైనార్టీ సెల్ అధ్యక్ష పదవికి తన పేరును ప్రతిపాదించి, తన నియామకానికి కృషి చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ పాల్‌చంద్రశేఖర్, క్రైస్తవ నాయకులు జయకుమార్, జీవరత్నం, జీవరాజు, ఏసయ్య, శాంతన్, ఏసుదాసు, రెడ్డిశేఖర్, అబ్రహాం, మాలమహానాడు మోహన తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరానికి స్పందన

కేవీపల్లె : మండంలోని వగ్లల గ్రామ సచివాలయంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి స్పందన లభించింది. మంగళవారం సర్పంచ్ రెడ్డికాంతమ్మ ఆధ్వర్యంలో పీలేరు భాస్కర్ నేత్రాలయ వారు కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 32 మందికి కంటి పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కంటి సంరక్షణపై సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రామకొండారెడ్డి, వైద్య బృందం సొకత్‌అలిబాషా, శిరీష, మాధురి, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో ప్రవేశానికి గడువు పెంపు

వాల్మీకిపురం : ఆంధ్రప్రదేశ్ మైనార్టీ బాలికల గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాల ప్రవేశానికి అర్హులైన విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని పాఠశాల, కళాశాల ప్రిన్సిపాళ్లు ఏఆర్ మంజుల, రమా మంజుల తెలిపారు. 2023–24 విద్యా సంవత్సరానికి గాను 5, 6, 7, 8 తరగతులతో పాటు ఇంటర్ ప్రథమ సంవత్సర ప్రవేశానికి ఈ నెల 28వ తేది లోపు అర్హులైన విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలన్నారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

రైతు కుటుంబానికి ఎంపీ, ఎమ్మెల్యే చేయూత

పెద్దతిప్పసముద్రం : అప్పుల బాధ తాళలేక ఆత్మహత్య చేసుకున్న ఓ రైతు కుటుంబానికి రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి చేయూత నిచ్చారు. వివరాల్లోకి వెళితే మండలంలోని కాట్నగల్లు పంచాయతీ ఉయ్యాలవారిపల్లికి చెందిన రైతు చిన్నకామిరెడ్డి వెంకట్రమణారెడ్డి (42) అప్పులతో జీవితంపై విరక్తి చెంది ఈ ఏడాది ఫిబ్రవరి 6న ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ తరుణంలో బాధిత కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని మృతుడి భార్య రామలక్ష్మమ్మకు ఎంపీ, ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో సత్యసాయి జిల్లా గోరంట్ల సమీపంలో అగ్రికల్చర్ డిప్లమో చదువుతున్న మృతుడి కుమార్తె దీప్తి చదువుకు అవసరమయ్యే రూ.3.10 లక్షల ఫీజును తామే చెల్లిస్తామని చెప్పారు. ఈ తరుణంలో ఫీజులో భాగంగా ఈ ఏడాది చెల్లించాల్సిన రూ.1.50 లక్షల నగదును సదరు కళాశాలకు జమ చేసినట్లు మృతుడి భార్య మంగళవారం పేర్కొంది. తమ కుటుంబానికి అండగా నిలచిన ఎంపీ, ఎమ్మెల్యేకు తాము జీవితాంతం రుణపడి ఉంటామని కుటుంబీకులు పేర్కొన్నారు.

బడుగుల జీవితాల్లో వెలుగు

వాల్మీకిపురం : సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి తన పాలన ద్వారా బడుగు, బలహీన వర్గాల జీవితాల్లో వెలుగులు నింపారని మండలంలోని గండబోయనపల్లి సర్పంచ్ గుర్రప్ప అన్నారు. మంగళవారం మండలంలోని గండబోయనపల్లిలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. గత తెలుగుదేశం ప్రభుత్వ పాలన, ప్రస్తుత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోని సంక్షేమ పథకాలకు తేడాలను ప్రజలకు వివరించారు. శీనా, సత్తిపండు, రాజన్న, సంజీవ్ రెడ్డి, ఉత్తన్న, భాస్కర్ రెడ్డి, రమణ, సత్య, గృహసారథులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ విధానాలపై పోరాటం

మదనపల్లె : ప్రజావ్యతిరేక విధానాలు అమలు చేస్తున్న కేంద్ర ప్రభుత్వంపై నిరంతర పోరాటం కొనసాగిస్తామని సీపీఐ, సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామానాయుడు, వెంకటేశ్వర్లు, శివారెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని చిత్తూరు బస్టాండు వద్ద ప్రచారజాత కార్యక్రమం సందర్భంగా సమావేశం ఏర్పాటు చేసి కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించారు. మహేష్, టి.కృష్ణప్ప, సాంబశివ, హరేంద్రనాథ్‌శర్మ, ప్రభాకర్, తిరుమల, దేవ, ఓబులేసు పాల్గొన్నారు.

గుంతలవారిపల్లె దారి సమస్యకు పరిష్కారం


గుంతవారిపల్లెలో దారి సమస్యపై చర్చిస్తున్న ఎమ్మెల్యే నవాజ్‌బాషా, పెద్దిరెడ్డి తదితరులు

రామసముద్రం : రామసముద్రం మండలం మినికి పంచాయతీ గుంతలవారిపల్లెకి చెందిన గ్రామస్తులకు 30 సంవత్సరాలుగా దారి సమస్య ఉండేది. ఈ సమస్యపై గతంలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ పెద్దిరెడ్డి వెంకటమిధున్‌రెడ్డికి ప్రజలు విన్నవించారు. మంగళవారం వారి సూచనల మేరకు మదనపల్లె ఎమ్మెల్యే నవాజ్‌బాషా , వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి , జెడ్పీటీసీ సిహెచ్ రామచంద్రారెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు కేశవ రెడ్డి, పుంగనూరు మార్కెట్ కమిటీ చైర్మన్ అమరనాథరెడ్డి, వైస్ ఎంపీపీ రమణారెడ్డిలు గ్రామాన్ని సందర్శించారు. గ్రామంలో ఇరువర్గాలను విచారించి సమస్యను పరిష్కరించారు. అలాగే మండలంలోని రాగిమాకులపల్లె పంచాయతీ సొన్నెపల్లి గ్రామానికి చెందిన నాగేష్, కవితల కుమారులు నందకిషోర్, సందీప్‌లు గత ఏడాది ప్రమాదవశాత్తు నీటికుంటలో పడి మృతి చెందారు. ఈ మేరకు ప్రభుత్వం తరపున ఒకొక్కరికి లక్షరూపాయలు చొప్పున ఆర్థిక సహాయం చెక్కులను ఎమ్మెల్యే నవాజ్‌బాషా , పెద్దిరెడ్డి చేతులు మీదుగా బాధితుల తల్లిదండ్రులకు అందజేశారు.

కురబల గెలుపునకు కృషిచేద్దాం


మాట్లాడుతున్న జబ్బల శ్రీనివాసులు

మదనపల్లె : కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న కురబలను పార్టీలకు అతీతంగా గెలిపించుకునేందుకు ఆంధ్రప్రదేశ్ సరిహద్దు నియోజకవర్గాల నుంచి పెద్దసంఖ్యలో కురబ యువత తరలి రావాలని ఏపీ కురబసంఘం రాష్ట్ర అధ్యక్షుడు జబ్బలశ్రీనివాసులు కోరారు. మంగళవారం స్థానిక కురబసంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో కురబలకు రాజకీయ ప్రాధాన్యత కల్పిస్తూ 224 సీట్లకు అన్ని పార్టీలు 25 ఎమ్మెల్యే స్థానాలు కేటాయించాయన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కురబలకు గతంలో ప్రముఖ రాజకీయ పార్టీలు ప్రాధాన్యత కల్పించక అన్యాయం చేస్తే సీఎం జగన్ మోహన్‌రెడ్డి 2019 ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ తరపున ఇద్దరు ఎమ్మెల్యేలు, ఒక ఎంపీని గెలిపించుకోవడమే కాకుండా మంత్రివర్గంలోనూ స్థానం కల్పించారన్నారు. కురబలు ఈ విషయమై రాష్ట్రంలో వైఎస్సార్ సీపీకి రుణపడి ఉంటారన్నారు. అలాగే కురబలను తమిళనాడు, కర్నాటకలో ఎస్టీ జాబితాలో చేర్చేదిశగా అక్కడి కురుబ నాయకులు చేస్తున్న పోరాటానికి మద్దతుగా ఆంధ్రప్రదేశ్‌లోనూ కురుబ, కురుమల ఎస్టీ పోరాటం ప్రారంభిస్తూ, ఢిల్లీలో ఏప్రిల్ 3న కురుబలకు బీసీ వద్దు-ఎస్టీ ముద్దు పేరుతో కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. సమావేశంలో ఆసంఘం నియోజకవర్గ అధ్యక్షుడు కప్పలరాజా, పట్టణ అధ్యక్షులు రామాంజులు, ఎంపీటీసీ జగదీష్, కే.వినయ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వసతిగృహాల్లో మెరుగైన సౌకర్యాలు


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఏఎస్‌డబ్ల్యుఓ, ఫోర్డు డైరెక్టర్ లలితమ్మ తదితరులు

మదనపల్లె సిటీ : ప్రభుత్వ సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు ఉన్నాయని సాంఘిక సంక్షేమశాఖ ఏఎస్‌డబ్యూఓ శ్రీరాములునాయక్ అన్నారు. మంగళవారం స్థానిక ఫోర్డు కార్యాలయంలో ఫోర్డు డైరెక్టర్ లలితమ్మతో కలిసి సంక్షేమాధికారులు, సిబ్బందితో గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులను హాస్టల్స్‌లో చేర్పించడానికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రాబోయే విద్యాసంవత్సరంలో విద్యార్థులను హాస్టల్‌లో చేర్పించాలన్నారు. మదనపల్లె, తంబళ్లపల్లె ప్రాంతాల్లో చాలా మంది డ్రాపౌట్స్‌గా, బాల కార్మికులుగా మారుతున్నారని వీరిని గుర్తించి హాస్టల్‌లో చేర్పించాలన్నారు. ప్రభుత్వం విద్య,సంక్షేమానికి ఎంతో ప్రాధాన్యత ఇస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వసతిగృహాల వార్డన్లు, ఫోర్డు సిబ్బంది పాల్గొన్నారు.

మలేరియా నివారణకు కృషి చేయాలి

మదనపల్లె : మలేరియా నివారణకు ప్రజలందరూ కృషి చేయాలని డిప్యూటీ డీఎహెచ్‌వో లక్ష్మి అన్నారు. మంగళవారం ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా వైద్య సిబ్బందితో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో అవగాహన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ ఏడాది ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా జీరో మలేరియా కేసులను గుర్తించే సమయం అనే అంశాన్ని థీమ్‌గా ఎంచుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రమీళ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పీలేరు : మలేరియా వ్యాధిని అంతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వైద్యాధికారులు డాక్టర్ కార్తీక్‌కుమార్, రమేష్‌రెడ్డి అన్నారు. మంగళవారం రేగళ్లు, తలపుల పీహెచ్‌సీల ఆధ్వర్యంలో పీలేరులో మలేరియా దినోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దోమల కాటు వల్లే మలేరియా వస్తుందని, దోమలు వృద్ధి చెందకుండా నియంత్రణ చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో సబ్‌యూనిట్ అధికారి విద్యాసాగర్, సీహెచ్‌వో విజయలక్ష్మి, హెచ్‌ఈలు ఉషారాణి, కొండయ్య, సూపర్‌వైజర్‌లు మురళీ, పవన్, రత్నం, మోహన్, విజయలక్ష్మి, ఆరోగ్య కర్తలు పాల్గొన్నారు.

ప్రకృతి వనరులను కాపాడుకోవాలి


మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డి

కురబలకోట : ప్రకృతి వనరులను కాపాడుకోవాలని, అవి మానవ మనుగడకు అత్యంత కీలకమని మదనపల్లె మున్సిపల్ చైర్ పర్సన్ మనూజ రెడ్డి అన్నారు. కురబలకోట మండల పరిషత్ మీటింగ్ హాల్‌లో మంగళవారం డివిజన్‌లోని మహిళా సర్పంచ్‌లకు సహజ వనరుల సంరక్షణపై ఎఫ్‌ఈఎస్ ఆధ్వర్యంలో అవగాహన సమావేశం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా ఆమె మాట్లాడుతూ ఉమ్మడి వనరులు క్రమంగా తరిగిపోతున్నాయన్నారు. వీటిని సంరక్షించి అభివృద్ధి చేయాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఎంపీపీ బి.దస్తగిరి మాట్లాడుతూ మహిళా సర్పంచులు గ్రామాల్లో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకోవాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను వినియోగించుకుని గ్రామాలను అభివృద్ధి బాటలో నడిపించాలన్నారు. ఎఫ్‌ఈఎస్ సీనియర్ మేనేజర్ రాణి రెడ్డి ఆధ్వర్యంలో శిక్షణ పూర్తి చేసుకున్న సర్పంచులకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు.

పేదల బతుకులు మారాయి

- ప్రతి కుటుంబంలో ఆనందం
- జగన్ పాలనలో సంక్షేమ లబ్ధి
- గడపగడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి


ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి

తంబళ్లపల్లె: ముఖ్యమంత్రి జగన్ సంక్షేమ పాలనలో నిరుపేదల బతుకులు మారాయి. ప్రతి కుటుంబంలో ఆనందం నెలకొంది. రాజకీయపార్టీలు, కుల, మతాలకు అతీతంగా ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాల లబ్ధి చేకూరిందని ప్రజలే ముక్తకంఠంతో చెబుతుండడం విశేషం. మండలంలోని ఎద్దులవారిపల్లె, రేణుమాకులపల్లె పంచాయతీలలో మంగళవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి హాజరయ్యారు. ప్రతి గ్రామంలోనూ ఎమ్మెల్యేకు గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. గడపగడపకు వెళ్లి ప్రజలను పలకరించి వారి కుటుంబానికి చేరిన సంక్షేమ పథకాల వివరాలు అడుగుతూ ప్రస్తుత సమస్యలను తెలుసుకొని కొన్ని సమస్యలను అక్కడేపరిష్కరించారు. ఏ పల్లెకు వెళ్లినా ప్రజలే తమ బతుకులు మారాయని, ఇప్పటి వరకు ఏ ప్రభుత్వం చేయనిరీతిలో జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందాయని చెప్పారు. ఎమ్మెల్యే సంతోషం వ్యక్తం చేస్తూ ఎప్పటికీ మీ ఆశీస్సులు ఉండాలని, నియోజకవర్గ ప్రజలకు రుణపడి ఉంటానని తెలిపారు. హరిజనవాడలో గడపగడపకు వెళ్తూ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నడింపల్లె గ్రామానికి ఇప్పటి రోడ్డు సౌకర్యం లేక అవస్థలు పడేవారమని ఎమ్మెల్యే కృషితో నేడు గ్రామానికి తారురోడ్డు వేయడంతో గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. పి, ప్రజలు మరోమారు సీఎంగా జగన్ మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని కోరారు. అనంతరం రేణుమాకులపల్లె మాజీ సర్పంచ్ ఆవుల ప్రభాకర్ రెడ్డి ఇంటికి వెళ్లి ఆయన భార్య, కుమార్తె, కుమారులను పలకరించి అండగా ఉంటామని భరోసా కల్పించారు. అక్కడ నిర్మాణదశలో ఉన్న మసీదు నిర్మాణాన్ని పరిశీలించి అందుకు అవసరమైన గ్రానైట్, సిమెంట్, టైల్స్ వితరణ అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఆనంద్‌కుమార్, ఎంఈవో త్యాగరాజు, సర్పంచులు రెడ్డి నారాయణ, మహ్మద్ అలీ, సింగిల్‌విండో చైర్మన్ భార్గవ్‌రెడ్డి, మల్లయ్యకొండ చైర్మన్ మల్‌రెడ్డి, ఆర్‌బీకే చైర్మన్ రెడ్డిమల్‌రెడ్డి, వాటర్‌షెడ్ చైర్మన్ నరసింహారెడ్డి, నాయకులు సురేంద్ర, కరీముల్లా, శ్రీరాములు, రెడ్డెప్పరెడ్డి, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జగన్‌ను మళ్లీ సీఎం చేయడమే లక్ష్యం

కురబలకోట : రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయంతో జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రి చేయడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి పార్టీ శ్రేణులను కోరారు. మంగళవారం నియోజక వర్గంలోని జేసీఎస్ కన్వీనర్లు, సచివాలయ కన్వీనర్లతో ఆయన పార్టీ కార్యాలయంలో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ జగనన్నే మా భవిష్యత్తు–మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమాన్ని నియోజకవర్గంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించారన్నారు. ప్రతి గ్రామంలో అపూర్వ స్వాగతం లభించిందన్నారు. ఈ కార్యక్రమం ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా కోటి కుటుంబాలకు పైగా చేరువవడం ఓ చరిత్రేనన్నారు. ప్రతి ఇళ్లు తిరుగుతూ ప్రజలతో మమేకం అయిన ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లను అభినందించారు.

ఘనంగా శివపార్వతుల కల్యాణం


శివ పార్వతుల కల్యాణోత్సవ దృశ్యం

పెద్దతిప్పసముద్రం : స్థానిక శ్రీ ప్రసన్న విరూపాక్షేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం ససగరం పట్టాభిరామయ్య ఆధ్వర్యంలో శివ, పార్వతుల కల్యాణోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. స్వామి వారి ప్రతిమలకు వేద పండితులు ప్రత్యేక పుష్పాలతో సుందరంగా అలంకరించారు. అనంతరం జగద్గురు ఆది శంకరాచార్యుల చిత్ర పటాన్ని ఊరేగించి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

ప్రాథమిక పాఠశాల తనిఖీ

తంబళ్లపల్లె : మండలంలోని ఎద్దులవారపల్లె ప్రాథమిక పాఠశాలను ఎంఈవో త్యాగరాజు మంగళవారం తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు, రికార్డులను పరిశీలించారు. విద్యార్థుల అభ్యసన స్థాయిని ప్రశ్నించి సంతృప్తిని వ్యక్తం చేశారు. టీచర్ సుగుణమ్మ పిల్లలకు నిర్వహిస్తున్న పరీక్షల తీరును సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట సీఆర్పీ బాలక్రిష్ణ ఉన్నారు.

ఆర్టీసీ ఆదాయం రోజుకు రూ. 72 లక్షలు

పీలేరు రూరల్ : జిల్లాలో రోజుకు ఆర్టీసీ ఆదాయం రూ.72 లక్షలు వస్తున్నట్లు ఆర్‌ఎం రాము తెలిపారు. మంగళవారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్, గ్యారేజ్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 478 బస్సు సర్వీసులు ఉన్నాయని, 1.85 లక్షల కిలో మీటర్లు తిరుగుతున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో కిలో మీటరు ఆదాయంలో జిల్లా 16వ స్థానంలో ఉందన్నారు. కమర్షియల్‌లో మదనపల్లె-2 డిపో మొదటి స్థానంలో ఉందని తెలిపారు. కొంతకాలంగా ఆగిన పీలేరు – నెల్లూరు బస్సు సర్వీసును యథావిధిగా పునురద్ధరిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఆర్టీసీ డైరెక్టర్ రాజారెడ్డి, డీఎం కుమార్, సీఐ ధనుంజయలు, ఎస్టీఐ సుధాకర్‌నాయక్ పాల్గొన్నారు.

నేడు, రేపు నాక్ పీర్ బృందం రాక

వాల్మీకిపురం : ఈ నెల 26, 27వ తేదీల్లో ఎన్టీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు న్యాక్ పీర్ టీం రానున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ క్రిష్ణమూర్తి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ నైపుణ్యాలను పెంపొందించే విధంగా సర్టిఫికెట్ కోర్సులను ప్రవేశ పెట్టి విద్యార్థులను సమర్థవంతులైన, విలువలతో కూడిన పౌరులుగా, సమాజ శ్రేయస్సు పట్ల చిత్తశుద్ధి ఉన్న వ్యక్తులుగా తయారు చేయడమే లక్ష్యంగా కళాశాల నడుస్తోందన్నారు. పీహెచ్‌డి, సెట్, నెట్ విద్యార్హతలున్న అధ్యాపక బృందంతో కళాశాల దినదినాభివృద్ధి చెందుతోందని తెలిపారు. జాబ్ మేళాలు నిర్వహించి, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నామన్నారు.

ఉన్నత విద్యను అందించాలనే లక్ష్యంతో..

గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఉన్నత విద్యను అందించాలనే లక్ష్యంతో 1988లో ప్రస్తుత పీవీసీ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో స్థాపించారు. మొదట్లో బీఏ, బి.కాం కోర్సులతో మొదలైన ఈ కళాశాలలో కాలక్రమంలో సైన్సు కోర్సులైన బి.ఎస్సీ (ఎం.పి.సి), బిఎస్సీ (ఎం.పి.సి.ఎస్), బిఎస్సీ (మైక్రోబయాలజీ), బిఎస్సీ (బి.జెడ్.సి) కోర్సులు మంజూరయ్యాయి. పట్టణ నడిబొడ్డున పూలకుంటలో 4.51 ఎకరాల జాగాను కళాశాల భవనం కోసం ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి సేకరించి, తనకు కేటాయించిన రూ.40లక్షలతో పూర్తి కళాశాల భవనంతో పాటు ప్రహరీని సైతం నిర్మించి ఇచ్చారు.

చిరుధాన్యాల ఉత్పత్తులతో ఆదాయం

కలికిరి : చిరుధాన్యాల ఉత్పత్తులతో స్వయం ఉపాధి, ఆదాయం పొందవచ్చని కేవీకే కో–ఆర్డినేటర్ డా. పాండురంగ అన్నారు. స్థానిక కేవీకే కార్యాలయంలో చిరుధాన్యాల ఉత్పత్తులపై వారం రోజుల శిక్షణ కార్యక్రమం మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత జీవన శైలిలో ఆహారపు అలవాట్లలో తప్పనిసరిగా చిరుధాన్యాల ఉత్పత్తులు ఉండాల్సిన అవసరం ఉందన్నారు. వీటితో దీర్ఘకాల ఆరోగ్య సమస్యలు రాకుండా చూసుకోవచ్చని తెలిపారు. అనంతరం వివిధ రకాల ఉత్పత్తులపై ట్రైనర్ విద్యానంద్ వివరించారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు జ్యోతి పాల్గొన్నారు.

29 లోపు సామాజిక తనిఖీ పూర్తి చేయాలి


మాట్లాడుతున్న ఎంఈఓ వెంకటరమణ

ములకలచెరువు : ప్రభుత్వ పాఠశాలల్లో ఈ నెల 29వ తేదీలోపు సామాజిక తనిఖీ పూర్తి చేయాలని ఎంఈఓ వెంకటరమణ అన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ప్రభుత్వ పాఠశాలల హెచ్‌ఎంలతో ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. పేరెంట్స్ కమిటీ, ఉపాధ్యాయులు, విద్యార్థుల భాగస్వామ్యంతో పాఠశాలలో సామాజిక తనిఖీ నిర్వహించాలని చెప్పారు. పాఠశాలలోని భౌతిక వనరులు, తరగతి గదులు, ఫర్నీచర్, స్పోర్ట్స్, జగనన్న విద్యాకానుక, మధ్యాహ్న భోజనం పథకం తదితర వాటిపై జిల్లా నుంచి వచ్చిన సిబ్బందితో తనిఖీ నిర్వహించాలని తెలపారు.

పేరెంట్స్ కమిటీలతో కలిసి సామాజిక తనిఖీ చేయాలి

మదనపల్లె సిటీ : పేరెంట్స్ కమిటీలతో కలిసి పాఠశాలలో సామాజిక తనిఖీ చేయాలని ఎంఈఓ ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక హోప్ ఎయిడెడ్ పాఠశాలలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం జరిగింది. ఎంఈఓ మాట్లాడుతూ పాఠశాలల్లో పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఫైర్‌సేఫ్టీ, విద్యుత్ సౌకర్యం, ఫర్నిచర్, తాగునీరు ఉండేలా చేసుకోవాలన్నారు. బడిబయట పిల్లలను పాఠశాలల్లో చేర్పించడం, బాల,బాలికల హక్కుల పరిరక్షణ కమిటీలను ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో సీఆర్‌పి మునినాయక్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో సామాజిక తనిఖీపై అవగాహన

గుర్రంకొండ: అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో సామాజిక తనిఖీ నిర్వహించాల్సి ఉంటుందని ఎంఈవో సురేంద్రబాబు, జిల్లా రిసోర్స్ పర్సన్ నాగేశ్వరావ్ అన్నారు. మంగళవారం స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో హెడ్మాస్టర్లను ఒక్క రోజు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాల తల్లిదండ్రుల కమిటీ, ఉపాధ్యాయుల భాగస్వామ్యంలో పాఠశాలల్లో సామాజిక తనిఖీలు నిర్వహించాల్సి ఉంటుందన్నారు. పాఠశాలలో ఉన్న వసతులు, కావాల్సిన సౌకర్యాలు, బడి బయట పిల్లల్ని పాఠశాలల్లో చేర్పించుట, బాల బాలికల హక్కు పరిరక్షణ కమిటీల ఏర్పాటు వంటివి సామాజిక తనిఖీలోభాగంగా చేపట్టాలన్నారు. వీటిపై హెడ్మాస్టర్లు అవగాహన కలిగిఉండి సదరు కార్యక్రమాన్ని విజయవంతం చేయించాలన్నారు.

అనారోగ్యంతో ఉన్న మహిళకు ఎంపీ ఆర్థిక సాయం


ఆర్థిక సాయం అందిస్తున్న దృశ్యం

పీలేరు రూరల్ : తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న ఓ మహిళకు రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి రూ. 75 వేలు ఆర్థిక సాయం చేశారు. పీలేరు పట్టణం కావలిపల్లెకు చెందిన మహేష్ భార్య డి. కుళ్ళాయమ్మ గుండె, ఊపిరితిత్తుల సమస్యలతో కొంత కాలంగా బాధపడుతూ తిరుపతిలో వైద్యం చేసుకుంటోంది. పార్టీ నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న ఎంపీ తక్షణ సాయంగా రూ. 75 వేలు ఖర్చులకు అందజేశారు. మంగళవారం స్థానిక మార్కెట్ యార్డులో ఏఎంసీ మాజీ చైర్మన్ కడప గిరిధర్‌రెడ్డి బాధితురాలకు ఆర్థికసాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంపీ సహకారంతో బెంగళూరునోని ఓ హాస్పిటల్‌లో ఆరోగ్య శ్రీ కింద శస్త్రచికిత్స చేపించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏపీ వేర్‌హౌస్ కార్పొరేషన్ డైరెక్టర్ నాగరాజమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు గడిబాషా, ఆనంద్, షాకీర్, సంజీవయ్య, బాలరాజు, మసూద్, గోవర్ధన్‌రెడ్డి, అబీద్, మునీర్ తదితరులు పాల్గొన్నారు.